నమస్తే తెలంగాణ
# పెద్దపల్లి
12 | కరీంనగర్, మంగళవారం 4 మార్చి 2025 | PEDDAPALLI



ఎండపల్లి మండల కేంద్రంలో పొలాలను కాపాడుకునేందుకు భారీ ప్రొక్లెయిన్‌తో పూడిక తీయిస్తున్న రైతు



ఎండపల్లి మండల కేంద్రంలో వరి పొలంలో ఎద్దులు, చిత్రంలో రైతు సబ్బ స్వామి

### అంతా బుగ్గిపాలైంది

నేను ఎకరాకు రూ.15 వేల చొప్పున 5 ఎకరాలు కౌలుకు తీసుకున్న. కొంత పత్తి వేసి నాలుగు ఎకరాల్లో వరి వేసిన. మొన్నటి వరకు వరికి రోగం వస్తే రూ.వేలకు వేలు ఖర్చు పెట్టి మందులు కొట్టిన. కొద్దిగ మంచిగైనంక ఇప్పుడు నీళ్లు లేక ఎండిపోతున్నది. పొలమంతా కాలువ పక్కనే ఉన్నా ఏనాడూ కాలువ నీళ్లు రాలేదు. బావిల నీళ్లు అడుగంటి రెండెకరాలు ఎండిపోయింది. ఉన్నది కాపాడుకునేందుకు కాలువ నీళ్లకు పోతే పైన ఉన్న రైతులు కాల్వకు గండి కొట్టుకుని కిందకు రాకుండా చేస్తున్నరు. అధికారులను అడిగితే నీరు వదులుతున్నామంటున్నరు. కానీ, మాకైతే అందుతలేవు ఏం చేయాలో అర్థంకాక పశువులను మేపుతున్న.

**- సబ్బ స్వామి, రైతు (ఎండపల్లి)**

# ఎండుతున్న ఎండపల్లి

- మొదలైన సాగునీటి కష్టాలు
- నెర్రెలువారుతున్న పంట పొలాలు
- ఆనవాళ్లు కోల్పోయిన కాలువలు
- ఇప్పటికే ఎండిన 50 ఎకరాలు
- ప్రశ్నార్థకంగా మరో వందెకరాలు
- ఆందోళనలో అన్నదాతలు



నీరు లేక అడుగంటిన వ్యవసాయ బావి

**ఎండపల్లి ఎండుతున్నది. సాగునీరు లేక పొలం నెర్రెలువారుతున్నది. వారబందీ నీళ్లు రాక కాలువ ఆనవాళ్లు కోల్పోగా.. కండ్లముందే పంట ఎండిపోతుంటే రైతు కంట కన్నీరు వస్తున్నది. ఇప్పటికే 50 ఎకరాల్లో పంట ఎండిపోగా, పరిస్థితి ఇలాగే ఉంటే మరో వందెకరాలు చేతికందకుండా పోయే ప్రమాదమున్నది.**

వెల్గటూర్, మార్చి 3 : గొల్లపల్లి మండలం రంగధామునిపల్లి వద్ద ప్రారంభమయ్యే ఎస్ఆర్ఎస్పీ డీ 83/ఏ కాలువ ద్వారా వారబంధీ లెక్కన నీటిని విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు సంతోష పడ్డారు. కాలువ పరీవాహక ప్రాంతంలో భూగర్భ జలాలు పెరుగుతాయని, బావుల కింద ధైర్యంగా వరి సాగు చేసుకున్నారు. కానీ, పేరుకే వారబంధీ అయింది. రంగధామునిపల్లి చెరువు నిండిన తర్వాత అక్కడి నుంచి సుమారు 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఎండపల్లికి నీళ్లు రావాల్సి ఉంటుంది. అయితే, చెరువు నిండినా కాలువ చెత్తా చెదారం, పిచ్చిమొక్కలు, పూడిక పేరుకుపోవడంతో ఇక్కడి వరకు రావడం గగనమే అయింది. ఇక ఎండపల్లి నుంచి సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న అంబారిపేట వరకు కాలువ ఉన్నా అక్కడి రైతులు ఆశలు వదులుకున్నారు. ఎండపల్లి, అంబారిపేట వరకు కనీసం ఒక్కసారి కూడా సాగునీరు రాకపోవడంతో కాలువలు, బావుల కింద పంటలు ఎండిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఎండపల్లి మండల కేంద్రంలో సుమారు 520 ఎకరాల్లో 150 మంది రైతులు వరి సాగు చేయగా, నీళ్లు లేక ఇప్పటి వరకు సూమారు 25 మంది రైతులకు చెందిన 55 నుంచి 60 ఎకరాలల్లో పంట ఎండిపోయింది. పరిస్థితి ఇలాగే ఉంటే మరో వందెకరాలు సైతం ఎండే ప్రమాద మున్నది. ఈ విషయం అధికారులకు తెలిపినా ఫలితం లేకపోవడంతో ఏం చేయాలో పాలు పోక రైతులు తమ పంట పొలాల్లో పశువులను మేపుతున్నారు. భూమి కౌలుకు తీసుకుని సాగు చేసిన రైతులు కంటతడి పెడుతున్నారు. గడిచిన పదేండ్లలో ఏనాడు సాగు నీళ్లకు ఇబ్బంది పడలేదని కేసీఆర్ పాలనను గుర్తు చేసుకున్నారు. పంటలు ఎండుతున్న విషయాన్ని ఎస్సారెస్పీ డీఈఈ రమేశ్‌ను ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేయగా, ఆయన సమాధానం దాటవేయడం గమనార్హం.



పొలంలో గొర్రెలను మేపుతున్న రైతులు



ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలతో ఆనవాళ్లు కోల్పోయిన డీ 83/ఏ కాలువ



ఎండిన పొలంలో దీనంగా రైతు

### కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడే బాగుండె



కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు నేను ఏనాడూ బావిల పూటిక తీయలేదు. ఇప్పుడు నీరు అడుగంటడంతో నాకున్న రెండెకరాల పంటను కాపాడుకునేందుకు భారీ ప్రొక్లేన్‌తో పూటిక తీయిస్తున్న. లోపల మొత్తం బండరాయి వచ్చింది. దీన్ని పగుల కొట్టేందుకు డ్రిల్లింగ్ చేయిస్తున్న. ఇప్పటికే 60 వేలు ఖర్చయినయ్. ఇంకెన్ని అయితయో తెలుస్తలే. గతంలో మాకు ఈ బాధ లేకుండె. మాకు ఇప్పుడు ఎందీ గోస.

**- అన్నె శంకరయ్య, రైతు**

### మా కంట్లో మేమే మట్టి కొట్టుకున్నం



మార్పు వస్తే మాకు మంచి జరుగుతుందనుకుంటే మా కంట్లో మేమే మట్టి కొట్టుకున్నట్లయింది. కేసీఆర్ సార్ ఉన్నన్ని రోజులు మాకు ఈ గోస లేదు. కరెంటు మోటర్ వేసుకుని ఇంట్లో పడుకున్న. రాత్రంతా మోటర్ నడిచినా బావిల నీళ్లు ఐపోలే. ఇంత బాధ ఏనాడూ పడలే. రాత్రి కాల్వ నీళ్లకు పోతే మళ్లీ పాత రోజులు గుర్తుకు వచ్చినయ్. పాములు, తేళ్లు ఎదురు పడుతున్నయ్. దయచేసి మాకు ఒక్క 20 రోజులు నీరందిస్తే కొంత వరకు బయటపడుతం.

**- పెసరు చంద్రయ్య రైతు (ఎండపల్లి)**

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కౌంటింగ్‌పై ఉత్కంఠ

- వెలువడిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఫలితం
- విజయం సాధించిన కొమురయ్య
- కొనసాగుతున్న పట్టభద్రుల ఓట్ల లెక్కింపు
- పెరుగుతున్న చెల్లుబాటు కాని ఓట్లు
- టెన్షన్ పడుతున్న అభ్యర్థులు
- చెల్లని ఓట్లపై భిన్నాభిప్రాయాలు
- అవగాహన కల్పించడంలో విఫలమయ్యారనే విమర్శలు
- కొట్టిపారేసిన అధికారులు

**కరీంనగర్‌– నిజామాబాద్‌– ఆదిలాబాద్‌– మెదక్ ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కౌంటింగ్‌పై ఉత్కంఠ కొనసాగుతున్నది. సోమవారం ఉదయం కరీంనగర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో లెక్కింపు ప్రక్రియ మొదలు కాగా, రాత్రి 10గంటల వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఫలితం వెల్లడైంది. బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య విజయం సాధించగా.. పట్టభద్రుల రిజల్ట్‌పై మాత్రం టెన్షన్ నెలకొన్నది. క్షణం క్షణం మారుతున్న పరిణామాలు, చెల్లుబాటు కాని ఓట్లు.. మొదటి ప్రాధాన్యతలో ఎవరూ గెలిచే అవకాశాలు లేకపోవడం ప్రధాన అభ్యర్థుల్లో ఆందోళన పెరుగుతున్నది. ఓట్లు ఎక్కువ ఉన్నందున లెక్కింపు ఆలస్యం కాగా, నేడు గెలుపెవరిదో తేలనున్నది.**




కరీంనగర్‌లోని అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు చేస్తున్న సిబ్బంది

కరీంనగర్ కలెక్టరేట్, మార్చి 3 : పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ గత నెల 27న ముగిసింది. కౌంటింగ్ సోమవారం ఉదయం 8గంటలకు కరీంనగర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో మొదలైంది. రాత్రి 10గంటల వరకు టీచర్ ఎమ్మెల్సీ ఫలితం వెలువడగా, బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్యకు విజయం దక్కింది. అయితే పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌటింగ్ మాత్రం టెన్షన్ టెన్షన్‌గా కొనసాగుతున్నది. గెలుపు ధీమాతో ఉన్న అభ్యర్థులకు ముచ్చెమటలు పట్టిస్తున్నది. అందుకు అనేక కారణాలు కనిపిస్తున్నాయి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి మొత్తం 2,58,328 ఓట్లు పోలు కాగా, వీటిని ఉదయం నుంచి లెక్కిస్తున్నారు. అందు కోసం 21 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్‌కు 24 బ్యాలెట్ బాక్సుల చొప్పున కేటాయిస్తూ వస్తున్నారు. ముందుగా ఒక్కో బ్యాలెట్ బాక్సులోని బ్యాలెట్ పేపర్లు బయటకు తీసి వాటిలో చెల్లని, చెల్లుబాటయ్యే ఓట్లుగా విభజిస్తున్నారు. చెల్లుబాటయ్యే బ్యాలెట్ పేపర్లను ప్రతి 25 పేపర్లకు ఒక బెండల్‌గా చేసి, అభ్యర్థులకు కేటాయించిన బాక్సుల్లో వేస్తున్నారు. నిజానికి రెండు స్థానాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు కోసం కౌటింగ్ కేంద్రంలో మొత్తం 35 టేబుళ్లు ఏర్పాటు చేశారు. అందులో 21 పట్టభద్రుల స్థానం కోసం, 14 ఉపాధ్యాయ స్థానం కోసం ఏర్పాటు చేశారు. పట్టభద్రుల స్థానంలో చెల్లని ఓట్ల సంఖ్య పెరుగుతున్న కొద్దీ ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో టెన్షన్ పెరుగుతూ వస్తున్నది. గెలుస్తామనే ధీమాతో ఉన్న ముగ్గురు అభ్యర్థులకు చెల్లని ఓట్లతో ఆందోళన మొదలైంది. అయితే ఈ చెల్లని ఓట్లు ఎవరి తలరాతలను మారుస్తాయోనన్న ఆందోళన ప్రధాన అభ్యర్థుల్లో కనిపిస్తున్నది. అలాగే మొదటి ప్రాధాన్యతలోనే తమ గెలుపు ఖరారవుతుందన్న ఆశాభావంతో ఉన్న అభ్యర్థుల ఆశలు నెరవేరేలా కనిపించడం లేదు. కౌటింగ్‌కేంద్రాల్లో జరుగుతున్న విభజన సరళిని బట్టి.. చూస్తే రెండో ప్రాధాన్యతకు కచ్చితంగా వెళ్లక తప్పదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఫలితాలు మంగళవారం వెలువడే అవకాశాలున్నాయి. కాగా, ఎమ్మెల్సీ ఓటింగ్ వేసే పద్ధతిని వివరించి చెప్పడంలో అధికారులు విఫలమయ్యారంటూ పలువురు స్వతంత్ర అభ్యర్థులు, కౌటింగ్ కేంద్రం వద్ద ఆందోళన చేయడంతోపాటు విమర్శలు చేశారు. అయితే వీరి ఆరోపణలను అధికారులు కొట్టిపారేశారు. అనేక రకాలుగా అవగాహన కల్పించామని చెప్పారు. కాగా, కౌటింగ్ కేంద్రం వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఆ ప్రాంతాల్లో ఎటువంటి ఆందోళన కార్యక్రమాలు చేయవద్దని ముందుగానే హెచ్చరించారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో కౌటింగ్ ప్రక్రియ సజావుగానే సాగుతున్నది.

### ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కొమురయ్య



కరీంనగర్‌– నిజామాబాద్‌– ఆదిలాబాద్‌– మెదక్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి మల్కకొమురయ్య విజయం సాధించారు. సమీప పీఆర్టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డిపై గెలుపొందారు. కొమురయ్యకే విజయ అవకాశాలు ఉంటాయని పోలింగ్ ముగిసిన నుంచి అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అందుకు అనుగుణంగానే ఫలితాలు వెలువడ్డాయి. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 25,041 ఓట్లు పోలు కాగా, అందులో 897 ఓట్లు చెల్లకుండా పోయాయి. 24,144 ఓట్లు చెల్లుబాటు కాగా, అందులో కొమురయ్యకు 12,959 ఓట్లు, మహేందర్‌రెడ్డికి 7.182ఓట్లు వచ్చాయి. అలాగే అశోక్ కుమార్‌కు 2,621 ఓట్లు వచ్చాయి.

## బూడిద లోడింగ్
# ఎన్టీపీసీనే చేపట్టాలి

- దళారుల నుంచి విముక్తి కల్పించాలి
- యాష్ లారీ టిప్పర్ అసోసియేషన్ నాయకుల డిమాండ్
- మల్యాలపల్లి గేట్ ఎదుట నిరసన



మల్యాల పల్లి గేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న యాష్ లారీ, టిప్పర్ అసోసియేషన్ నాయకులు

పెద్దపల్లి, మార్చి 3 (నమస్తే తెలంగాణ): బూడిద లోడింగ్‌ను ఎన్టీపీసీనే చేపట్టాలని, ఒక్కో టిప్పర్‌కు ₹4600 వసూలు చేస్తున్న దళారుల నుంచి తమకు విముక్తి కల్పించాలని లారీ, టిప్పర్ల ఓనర్లు, డ్రైవర్లు, క్లీనర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అంతర్గాం మండలం మల్యాలపల్లి గేట్ వద్ద యాష్ టిప్పర్ లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. బూడిద లారీల రవాణాను నిలిపివేసి ఎన్టీపీసీకి వ్యతిరేకంగా నినదించారు. ఎన్టీపీసీ విస్తరణతో సర్వస్వం కోల్పోయిన తమపై యాజమాన్యం వివక్ష చూపుతున్నదని, లారీలపై పనిచేస్తున్న తమ కడుపుకొట్టేలా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. ప్రతి రోజూ దాదాపుగా వెయ్యి లారీల ద్వారా బూడిద రవాణా జరుగుతుంటే అందులో స్థానిక లారీలు కేవలం 120వరకే ఉంటాయని చెప్పారు. నేషనల్ హైవేల నిర్మాణానికి బూడిదను తరలిస్తున్న లారీలకు ఎన్టీపీసీ ఒక్కో టన్నుకు ₹1260 చెల్లిస్తున్నదని, స్థానికంగా చిన్న చిన్న ఇటుక బట్టీలకు రవాణా చేసుకొనే తమకు మాత్రం అలాంటి చెల్లింపులేమీ చేపట్టడం లేదని మండిపడ్డారు. పైగా ఒక్కో లారీకి ₹4600 నుంచి ₹9200 వరకు లోడింగ్ చార్జీలు వసూలు చేస్తున్నారని వాపోయారు. యాష్ పాండ్‌లో లోడింగ్ దళారుల నుంచి విముక్తి కల్పించి ఇకపై నేరుగా ఎన్టీపీసీనే లోడింగ్ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇక్కడి నుంచి ఎక్కడికైనా బూడిద రవాణాను సైతం తామే చేస్తామన్నారు. ఎన్టీపీసీ యాజమాన్యం తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో తమ లారీల నుంచి బూడిద రవాణా చేపట్టబోమని అల్టిమేటం ఇచ్చారు. తమ సమస్యను ఎన్టీపీసీ యాజమాన్యం పరిష్కరించే వరకూ రవాణాను నిలిపి వేస్తున్నామని ప్రకటించారు. తమకు ఎమ్మెల్యే, ఎంపీ, ఇతర పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు సంఘీభావం తెలిపి మద్దతుగా నిలవాలని వారు విజ్ఞప్తి చేశారు.

### బూడిద ఫ్రీ లోడింగ్ చేపట్టాలి



ఎన్టీపీసీ యాజమాన్యం యాష్ పాండ్‌లలో లోడింగ్‌ను ఫ్రీగా చేపట్టాలి. ఈ దళారుల వసూళ్లను నిలిపివేయాలి. మల్యాలపల్లి బూడిద చెరువులో రోజుకు అక్రమంగా రూ. 50లక్షల వరకు వసూళ్లు చేస్తున్నరు. ఈ అక్రమ వసూళ్లలో రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్‌తోపాటు పై వరకూ పెద్ద ఎత్తున డబ్బులు ముడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నయి. పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నా అధికార పార్టీ నాయకులు అందుకే స్పందించడం లేదు. దగ్గరుండి స్థానికులకు అన్యాయం చేస్తున్నారు. బూడిద రవాణా నిలిపివేస్తున్న లారీ, టిప్పర్ యజమానులకు మేం మద్దతుగా నిలుస్తం. స్థానికులకు న్యాయం జరిగే వరకూ ఈ పోరాటం ఆగదు.

**-కౌశిక్‌హరి, కార్మిక సంఘాల నాయకుడు, బీఆర్ఎస్ నాయకుడు (రామగుండం)**

### మాకు న్యాయం చేయాలి



మేం ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగినం. ఇక్కడ లారీలను కొనుక్కొని ఉపాధి పొందుతున్నం. స్థానికులమైన మమ్మల్ని కాదని ఎన్టీపీసీ టెండర్లను పెట్టుకొని దళారులను తయారు చేసింది. మాతో ట్రిప్పులు కొట్టుకునే ఇటుక బట్టీలకు కూడా వాళ్లే కొట్టుకుంటున్నరు. ₹500, ₹600కే లోడింగ్ అయ్యేది. ఇప్పుడు ₹4,600 వసూలు చేస్తున్నారు. బయటి నుంచి లారీలను పిలిపించి స్థానిక లారీలను తిరగకుండా మా పొట్టకొడుతున్నరు. రోజుకు ఒక్క ట్రిప్పు కూడా పడడం లేదు. మా లారీలకు ఈఎంఐలు ఎలా కట్టుకోవాలే. మా కుటుంబాలను ఎలా పోషించుకోవాలే. ఇవన్నీ ఆలోచించడం లేదు. దళారీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించి మాకు న్యాయం చేయాలి.

**-బడికెల రాజశేఖర్, యాష్ టిప్పర్ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు (రామగుండం)**

### న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తం



పొల్యూషన్, పొగ అనుభవించేది మేం. కానీ, మేం ఇక్కడ పూర్తిగా నష్టపోతున్నం. బయటి నుంచి వచ్చే లారీల వాళ్లకే లాభం అవుతున్నది. ఎన్టీపీసీ ప్రోత్సహిస్తే మేమే ఇంకా లారీలు కొనుక్కొని రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికైనా బూడిదను మేమే సరఫరా చేస్తం. ఎన్టీపీసీ అలా చేయడం లేదు. బయటి లారీలకు ఒక్కో లారీకి ₹60వేల వరకు ఇస్తున్నది. మేమేమో ఒక్కో లారీకి ₹4600 నుంచి ₹9200 వరకు కట్టుకుంటున్నం. ఎన్టీపీసీనే ఫ్రీ లోడింగ్‌ను చేపట్టాలి.

**-శివనాద్రి గంగాధర్, మాజీ అధ్యక్షుడు లారీ అసోసియేషన్ (రామగుండం)**



కాల్వశ్రీరాంపూర్ మండలం కిష్టంపేటలో మానేరు నదిలో తొలగించని టోల్‌టాక్స్ గుడారం

# కొనసాగుతున్న ‘దారి’ దోపిడీ

- పట్టించుకోని అధికారులు
- రెచ్చిపోతున్న ప్రైవేట్ టోల్ నిర్వాహకులు

కాల్వశ్రీరాంపూర్, మార్చి 3 : కాల్వశ్రీరాంపూర్ మండలంలోని కిష్టంపేట, జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం బూర్నపెల్లి మానేరువాగుపై ‘దారి’ దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతున్నది. ‘మానేరువాగుపై మరో దారిదోపిడీ’ అనే శీర్షికన ఈ దందాను ‘నమస్తే తెలంగాణ’ వెలుగులోకి తేగా, సోమవారం సైతం ప్రైవేట్ టోల్ నిర్వాహకులు రెచ్చిపోయి వసూళ్లు చేశారు. ఉదయం 11గంటల వరకు అధికారులెవరైనా వస్తారేమోననుకొని నిర్వాహకులు ఎవరూ రాలేదు. దీంతో వాహనదారులు ఎలాంటి వసూళ్లు లేకుండా సంతోషంగా వెళ్లారు. కానీ, మళ్లీ 12 గంటల నుంచి యధావిధిగా టోల్ వసూలు చేస్తూ బరితెగించారు. అధికారుల్లో చలనం లేకపోవడంవల్లనే ఈ తతంగం నడస్తున్నదని వాహనదారులు మండిపడ్డారు.

# ఎండలు ‘మండె’న్

- పెరుగుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- రామగుండంలో 37.4 డిగ్రీలు



సోమవారం గోదావరిఖనిలో ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

కోల్‌సిటీ, మార్చి 3: ఎండ తీవ్రత పెరుగుతున్నది. మార్చి ఆరంభంలోనే దంచికొడుతున్నది. ఉదయం తొమ్మిది గంటల నుంచే ప్రతాపం చూపుతున్నది. మధ్యాహ్నం కల్లా భగ్గుమంటున్నది. రోజు రోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా, పొద్దంతా మండిపోతున్నది. రామగుండం అయితే నిప్పుల కొలిమిలా మారుతున్నది. ప్రతి వేసవిలో ఇక్కడ రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, ప్రస్తుతం అదే పరిస్థితి కనిపిస్తున్నది. సోమవారం గరిష్ఠంగా 37.4 డిగ్రీలు రికార్డయింది. ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్‌లో ఎంత తీవ్రంగా ఉంటుందోననే ఆందోళన వ్యక్తమవుతున్నది. కాగా, ఎండలు దంచి కొడుతుండటంతో మధ్యాహ్నం వేళ రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఇక ఇళ్లలో మూలన పడ్డ కూలర్లు మళ్లీ తిరుగుతున్నాయి.



కరీంనగర్‌లో గొడుగు పట్టుకొని వెళ్తున్న యువతులు